ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కలీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 04 నవంబరు, 2026 | పేజీలు : 08

'శ్రీనిత్య'ని అభినందించిన అదనపు కలెక్టర్



2 లో

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు

కలెక్టర్ సత్యప్రసాద్

ప్రజాపక్షం/జగిత్యాల ; సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని భద్రతా చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.జాతీయ రహదారులతో పాటు ఇతర రహదారులపై ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను విశ్లేషించి వాటి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా గత సమావేశం లో తీసుకున్న నిర్ణయాల అమలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చేపట్టాల్సిన చర్యలు,జాతీయ రహదారులపై రోడ్డు భద్రత మెరుగుదల పనుల పురోగతిపై సమీక్షించారు.జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 600 కిలోమీటర్ల మేర రహదారులు ఉన్నాయని, వీటి పై గత నెల రోజుల్లో ఎన్ని ప్రమాదాలు జరిగాయి, ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకున్నాయి అనే వివరాలతో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.జాతీయ రహదారులతో పాటు రాష్ట్ర రహదారులు, ఇతర రహదారులపై ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి,ప్రమాదాలకు కారణమవుతున్న అంశాలను విశ్లేషించాలన్నారు.ఇక పై జిల్లాలో ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే పోలీసు, జాతీయ రహదారుల సంస్థ,ఆర్&బి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయం తో ప్రమాద స్థలాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించాలని సూచించారు. ప్రమాదం జరగడానికి గల అసలు కారణాలను గుర్తించి,భవిష్యత్తు లో అదే ప్రాంతంలో మరో ప్రమాదం జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో స్పష్టమైన సూచనలతో నివేదిక రూపొందించాలని ఆదేశించారు.10 రోజులలో మరోసారి రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహిస్తామని, అప్పటి లోగా ఆర్&బి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు గత మూడు నెలల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలపై సమగ్ర విశ్లేషణ నివేదిక సమర్పించాలని తెలిపారు. ప్రమాద ప్రాంతాల్లో చెట్ల కొమ్మలను తొలగించడం, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్, వేగ సూచిక బోర్డులు, హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయడం వంటి చర్యలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.ప్రమాద ప్రాంతాల్లో, బ్లాక్ స్పాట్ల వద్ద రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయడంతో పాటు కొండగట్టు వద్ద ప్రమాదకర మలుపుల ప్రాంతాల్లో రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనదారులు ముందుగానే అప్రమత్తమయ్యేలా హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు, రవాణా, జాతీయ రహదారుల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం కారణంగా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల్లో ఎక్కువగా గాయపడుతున్నారని, తలకు గాయాలు కావడం



వల్ల మరణాల సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, అతివేగ నియంత్రణ చర్యలను మరింత విస్తృతంగా చేపడుతున్నట్లు తెలిపారు.ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను సమర్థవంతంగా గుర్తించి నియంత్రించేందుకు ఏఐ ఆధారిత కెమెరాల ఏర్పాటు అవసరమని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఈ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా వాహనాల రాకపోకలను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు నిబంధనలను ఉల్లంఘించే వాహనాలను గుర్తించి ఈచలాన్లు జారీ చేసే అవకాశం ఉంటుందని వివరించారు.అదేవిధంగా ట్రాఫిక్ విధులు నిర్వహించే సిబ్బందికి భద్రతా జాకెట్లు, బారికేడ్లు, హైబ్రిడ్ కెమెరాలు, హెల్మెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఎత్తైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసే కెమెరాల ద్వారా రహదారులపై పక్షి దృష్టితో (బర్డ్ ఐ వ్యూ) విస్తృత ప్రాంతాన్ని పర్యవేక్షించి ట్రాఫిక్ ఉల్లంఘనలను మెరుగ్గా గుర్తించవచ్చని తెలిపారు.అనంతరం జాతీయ రహదారులపై జరిగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించేందుకు ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో అంబులెన్స్ సేవలను ప్రారంభించారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీప ఆసుపత్రులకు తరలించి ప్రాణాలను కాపాడేలా అత్యవసర స్పందన వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.జాతీయ రహదారులపై ఏవైనా సమస్యలు,అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఎన్‌హెచ్ఏఐ టోల్ ఫ్రీ నంబర్ 1033కు సమాచారం అందించాలని అధికారులు తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ప్రసునాంభా,ఎన్‌హెచ్ఏఐ అధికారులు,ఆర్డీవోలు,మున్సిపల్‌కమిషనర్లు,రవాణా శాఖ, పోలీసు శాఖ, ఆర్ అండ్ బి,పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ,ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రామగుండంలో బిఆర్ఎస్..

పైలాన్ కూల్చివేత రగడ

మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సహా నాయకుల అరెస్టు



తరువాయి 2లో

ప్రజాపక్షం/పెద్దపల్లి ; రామగుండం నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు గుర్తుగా ఏర్పాటు చేసిన పైలాన్ తొలగింపు రాజకీయ దుమారం రేపింది.గోదావరిఖని గాంధీనగర్‌లో అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించిన పైలాన్‌ను రోడ్డు విస్తరణ పేరుతో

ఒక భవనానికే చట్టం వర్తిస్తుందా..

మిగతా వాటికి మినహాయింపా?

నిర్మల్‌లో మున్సిపల్ నిబంధనల అమలుపై అనేక ప్రశ్నలు!

ప్రజాపక్షం/నిర్మల్ ; నిర్మల్ పట్టణంలోని వాణిజ్య సముదాయాల నిర్మాణాలు, పార్కింగ్ సదుపాయాలు,భవన నిర్మాణ నిబంధనల అమలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఒకే ప్రాంతంలో,ఒకే రహదారి వెంట దాదాపు ఒకే తరహాలో కొనసాగుతున్న పలు షాపింగ్ సముదాయాల విషయంలో మున్సిపల్ అధికారుల చర్యల తీరుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పట్టణంలోని ఓ వాణిజ్య సముదాయానికి భవన నిర్మాణ నిబంధనలు,నిర్దేశిత సెట్బ్యాక్‌లు,సందర్శకుల పార్కింగ్ తదితర అంశాలపై వివరణ కోరుతూ మున్సిపల్ అధికారులు నోటీసు జారీ చేసినట్లు సమాచారం.ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో ఈ చర్య చేపట్టినట్లు తెలుస్తోంది. నిబంధనల అమలుపై అధికారులు దృష్టి సారించడం స్వాగతించదగినదే.కానీ అసలు ప్రశ్న అక్కడే మొదలవుతోంది.అదే ప్రాంతంలో,అదే రహదారిపై కొనసాగుతున్న ఇతర వాణిజ్య సముదాయాల పరిస్థితి ఏమిటి? వాటిలోనూ పార్కింగ్ సదుపాయాలు, సెట్బ్యాక్‌లు, భవన నిర్మాణ అనుమతులు నిబంధనల ప్రకారమే ఉన్నాయా? వాటిని కూడా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారా? పరిశీలిస్తే తీసుకున్న చర్యలేమిటి? పరిశీలించకపోతే ఎందుకు చేయలేదు? ఒకే ప్రాంతంలో ఒకే తరహా నిర్మాణాలు ఉన్నప్పుడు ఒక భవనంపై మాత్రమే ఫిర్యాదు ఆధారంగా చర్యలు తీసుకుని,మిగతా నిర్మాణాల విషయంలో మౌనం వహించడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. ఫిర్యాదు వచ్చిన చోటే నిబంధనలు గుర్తుకు వస్తాయా? మిగతా చోట్ల పరిస్థితులు



ఎలా ఉన్నా పట్టించుకోరా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.మున్సిపల్ చట్టాలు, భవన నిర్మాణ నిబంధనలు ఏ ఒక్క వ్యక్తికి లేదా వ్యాపార సంస్థకు మాత్రమే వర్తించేవి కావు. పట్టణంలోని ప్రతి వాణిజ్య నిర్మాణానికి ఒకే ప్రమాణాలు వర్తించాలి.నిబంధనల ఉల్లంఘన ఎక్కడ ఉన్నా ఒకే విధమైన తనిఖీలు,

తరువాయి 2లో

'శ్రీనిత్య'ని అభినందించిన అదనపు కలెక్టర్

ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన బిఎస్సి తృతీయ సంవత్సరం విద్యార్థిని ఎం.శ్రీనిత్య అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా న్యూ ఢిల్లీలోని భారత పార్లమెంట్ (లోకసభ)లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనే అవకాశం పొందింది. వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్2026 రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి ఎంపిక కావడంతో ఆమెకు ఈ అవకాశం లభించింది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ డా.అశ్విని తానాజీ వాకడే శ్రీనిత్యను ప్రత్యేకంగా అభినందించి ఆమె విజయాన్ని ప్రశంసించారు. యువత జాతీయస్థాయి వేదికలపై ప్రతిభను చాటుకుంటూ ప్రజాస్వామ్య విలువలు, దేశాభివృద్ధి పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. శ్రీనిత్య విజయంపై కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ, జిల్లా యువజన అధికారి ఎం.తిరుపతి, ఎన్ఎస్ఎస్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ డా.కె.నురేందర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పి.నితిన్, టి.రాజయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ విజయం కళాశాలతోపాటు కరీంనగర్ జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు.

రౌడిషీట్ ఓపెన్..

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: మహిళల పట్ల అసభ్యప్రవర్తన,శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని ఎల్లారెడ్డిపేటకు చెందిన సయ్యద్ జుబేర్‌పై రౌడిషీట్ తెరిచామని రాజన్నసిరిసిల్లా జిల్లా డీఎస్పీ కత్తరోజు నాగేంద్రచారి తెలిపారు.మంగళవారం మీడియా ప్రకటనలో మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ముఖ్యంగా మహిళల పట్ల అసభ్యప్రవర్తన కలిగించే వ్యక్తుల పట్ల నిఘా ఉంచుతున్నామని మహిళలు ఎలాంటి వేధింపులకు గురి అయినా భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.ఆయన వెంట ఎల్లారెడ్డిపేట పోలీసు సిబ్బంది ఉన్నారు.

అంగన్‌వాడి పోస్టులకు ఇంటర్వ్యూ

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : మండలంలోని పదిర,వెంకటాపురరం గ్రామాలలో ఖాళీగా ఉన్న అంగన్వాడి టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్తులకు బుధ,గురువారాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లుగా జిల్లా మహిళ సంక్షేమశాఖ అధికారి లక్ష్మి రాజం తెలిపారు.పదిరలో ఒకటి,వెంకటాపూర్ అంగన్వాడి టీచర్ అభ్యర్థులకు గురువారం ఇంటర్వ్యూ ఉంటుందని వెల్లడించారు.సిరిసిల్లా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం పదిగంటలకు ఇంటర్వ్యూ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.అర్హతగల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ దృవపత్రాలను తప్పనిసరగా వెంట తీసుకురావాలని సూచించారు.నిర్ణిత సమయానికి చేరుకుని హాజరుకావాలని చెప్పారు.



సమాచార హక్కు చట్టం సాధన కమిటీ అధ్యక్షుడిగా చేకూర్తి

ప్రజా పక్షం/వేములవాడ టౌన్: సమాచార హక్కు చట్టం 2005 అమలు, ప్రజల్లో అవగాహన కల్పన, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో చేపట్టిన "పల్లెకో ప్రతినిధి" కార్యక్రమంలో భాగంగా, సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ అధ్యక్షులుగా చేకూర్తి నవీన్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నియామకానికి సహకరించిన జిల్లా ఇన్‌చార్జి నర్సింగోజు శ్రీధర్‌కి వేములవాడ నియోజకవర్గ అధ్యక్షులు మల్లవేని సురేష్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, నూతనంగా ఎన్నికైన చేకూర్తి నవీన్‌కి జిల్లా అధ్యక్షులు పులి మధుకర్ అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో కమిటీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజలకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించి, ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షించారు.జిల్లా ఇన్‌చార్జి నర్సింగోజు శ్రీధర్ మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టాలని కోరుకున్నారు.

అంత్యక్రియలకు హాజరైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చందోలి గ్రామానికి చెందిన పిట్టల రమేష్ ఆకస్మిక మృతి పట్ల రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో చిరుద్యోగిగా పనిచేస్తున్న రమేష్ గత నెల 25వ తేదీన తీవ్ర జ్వరానికి గురయ్యారు.కుటుంబ సభ్యులు ఆయనను జగిత్యాల లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు.వైద్యులు చికిత్స అందించారు.ఆరోగ్యం మరింత క్షీణించడంతో దీంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ కు తరలించగా,మెరుగైన మెరుగైన వైద్యం కోసం అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ కు తరలించారు.హైదరాబాద్ లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ ఆరోగ్యం క్షీణించి ఆయన కన్నుమూశారు . ఈ విషాద వార్త తెలుసుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వెంటనే గ్రామంలోని ఆయన నివాసానికి చేరుకున్నారు.రమేష్ పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం తీవ్ర దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి



వారికి ధైర్యం చెప్పారు.రమేష్ అకాల మరణం ఆ కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ మంత్రి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఆ కుటుంబానికి ప్రభుత్వం తరఫున అన్ని విధాల అండగా ఉంటామని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.ఆ తర్వాత జరిగిన రమేష్ అంత్యక్రియల ముగింపు వరకు అక్కడే ఉండి,అంతిమ యాత్రలో మంత్రి స్వయంగా పాల్గొని అంతిమ వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ఆర్థిక సహాయం

సామాజిక సేవకులు ఎడమల భోజేందర్ రెడ్డి

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని మల్లన్నపేట్ గ్రామానికి చెందిన కట్ట వెంకట రమణ భార్య తరుణి గత కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు.ఈ విషయం తెలుసుకున్న ప్రముఖ సామాజిక సేవకులు ఎడమల భోజేందర్ రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించారు.మంగళవారం ఆయన బాధితురాలు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి స్వయంగా వెళ్లి, ఆమెను పరామర్శించారు. తరుణి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని ఆమెకు ధైర్యం చెప్పారు.అనంతరం ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం తన వంతు సహాయంగా రూ. 5 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు



అందజేశారు.ఏ ఆపద వచ్చినా తానున్నానంటూ ఆ కుటుంబానికి కొండంత అండగా నిలిచారు.ఈ కార్యక్రమంలో ఎడమల భోజేందర్ రెడ్డి తో పాటు ప్రముఖ యూత్ నాయకులు అవారి చందు కూడా పాల్గొని తరుణి త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి ఆర్థిక సాయం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని చిల్వాకోడూర్ గ్రామానికి చెందిన జక్కుల లచ్చయ్య, కవిత దంపతుల కుమార్తె లాస్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం గ్రామంలోని మృతురాలి నివాసానికి చేరుకుని,లాస్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం మృతురాలి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కష్టసమయంలో ధైర్యంగా ఉండాలని వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తక్షణ ఉపశమనంగా రూ.10 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని మంత్రి అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లాస్య అకాల మరణం అత్యంత బాధాకరమన్నారు.నిరుపేద కుటుంబానికి చెందిన ఈ బాధితులకు



ప్రభుత్వం ద్వారా కూడా అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాపల్లి గంగన్న ,సర్పంచ్ ఫోరం అధ్యక్షులు,స్థానిక సర్పంచ్ దాసరి తిరుపతి,మాజీ సర్పంచ్ లు రేవెల్ల సత్యనారాయణ గౌడ్,చిర్ర గంగాధర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ సేనలో సుఖేందర్ గౌడ్,మీనాకు కీలక బాధ్యతలు

ప్రజాపక్షం/మెట్‌పల్లి : తెలంగాణ రక్షణ సేన పార్టీ కోరుట్ల నియోజకవర్గంలో నూతన నియామకాలు చేపట్టింది. ఇందులో భాగంగా అసెంబ్లీ జనరల్ సెక్రటరీగా చెట్లపల్లి సుఖేందర్ గౌడ్‌ను, నియోజకవర్గ మహిళా విభాగం అధికార ప్రతినిధిగా చెట్లపల్లి మీనాను నియమించింది.తమకు ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితక్కకు,కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రఘుకు వారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని,పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

రామగుండంలో బిఆర్ఎస్ పైలాన్ కూల్చివేత రగడ

(మొదటి పేజీ తరువాయి)

జేసీబీ సహాయంతో తొలగించడంపై బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి.

జెసిబి ముందు బైఠాయించిన మాజీ ఎమ్మెల్యే : పైలాన్ తొలగింపు విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కౌశిక హరి, వ్యాళ్ల హరీశ్ రెడ్డి తదితర బీఆర్ఎస్ నాయకులతో కలిసి జేసీబీకి అడ్డంగా నిలబడి ధర్నాకు దిగారు. పైలాన్ తొలగింపును అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారుల తీరుపై చందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పైలాన్ తొలగింపునకు ఎవరు అనుమతిచ్చారు? ఏ ప్రాతిపదికన ఈ చర్యలు చేపట్టారు? అంటూ అధికారులను ప్రశ్నించారు. ఈ క్రమంలో పోలీసులతోనూ వాగ్వాదం చోటుచేసుకుంది.

ఎనిమిది గంటల పాటు ధర్నా: దిష్టిబొమ్మ దహనం...పైలాన్ కూల్చివేతను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నాయకులు దాదాపు ఎనిమిది గంటల పాటు ధర్నా కొనసాగించారు. నిరసనను మరింత ఉధృతం చేస్తూ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పైలాన్ తొలగింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, అభివృద్ధి పనులకు గుర్తుగా ఏర్పాటు చేసిన నిర్మాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు.

కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే తొలగింపులు చందర్ ఆరోపణ : రామగుండంలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ గెలిచిన తర్వాత చిరు వ్యాపారుల దుకాణాలు, గుళ్లను కూల్చివేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఐటీ పార్కులు, ఇండస్ట్రియల్ పార్కులు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు కేటాయించి ఏర్పాటు చేసిన పైలాన్‌లను రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తొలగిస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు గుర్తు చేసే ఆనవాళ్లను చెరిపివేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా? అని ప్రశ్నించారు.

ధర్నా ముగింపులో అరెస్టులు పోలీస్ స్టేషన్‌కు తరలింపు : దాదాపు ఎనిమిది గంటల పాటు కొనసాగిన ఆందోళన నేపథ్యంలో పోలీసులు మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి గోదావరిఖని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో గాంధీనగర్ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు పైలాన్ తొలగింపు, మరోవైపు బీఆర్ఎస్ నాయకుల నిరసన, దిష్టిబొమ్మ దహనం, అరెస్టులతో రామగుండం రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా చేపట్టిన పైలాన్ తొలగింపు వ్యవహారం ఇప్పుడు అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ వివాదానికి కేంద్రబిందువుగా మారింది.

ఒక భవనానికే చట్టం వర్తిస్తుందా.. మిగతా వాటికి మినహాయింపా?

(మొదటి పేజీ తరువాయి)

ఒకే విధమైన చర్యలు ఉండాలి. ఒకరిపై చర్యలు తీసుకోవడం ద్వారా బాధ్యత ముగిసిపోదు. అదే ప్రమాణాలతో మిగతా నిర్మాణాలను కూడా పరిశీలించాల్సి ఉంటుంది.ఇక్కడ మరో కీలకమైన ప్రశ్న కూడా ఉంది.ఒక ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ ఇబ్బందులు ఉన్నాయని గుర్తించినప్పుడు ఒక్క భవనాన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం సమస్యకు శాశ్వత పరిష్కారమవుతుందా? లేక ఆ ప్రాంతంలోని అన్ని వాణిజ్య సముదాయాలపై సమగ్ర తనిఖీలు నిర్వహించడమే సరైన విధానమా?మున్సిపల్ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించి, సంబంధిత ప్రాంతంలోని అన్ని వాణిజ్య భవనాల నిర్మాణ అనుమతులు, ఆమోదిత ప్లాన్లు, పార్కింగ్ ఏర్పాట్లు, సెట్బ్యాక్‌లపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలి. తనిఖీల వివరాలను ప్రజలకు వెల్లడించాలి. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్ట ప్రకారం సమానంగా చర్యలు తీసుకోవాలి.ఒకరికి నోటీసు.. మరొకరికి మౌనమా? ఒకరికి నిబంధనలు.. మరొకరికి మినహాయింపులా?ఈ ప్రశ్నలకు మున్సిపల్ యంత్రాంగం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే ప్రజలకు కావాల్సింది ఎంపిక చేసిన చర్యలు కాదు..అందరికీ ఒకే న్యాయం.



జర్నలిస్టు కుమార్‌ని పరామర్శించిన మాజీ జడ్‌పిటిసి



ప్రజాపక్షం/ముత్తారం : గత కొద్దిరోజుల క్రితంరోడ్డు ప్రమాదంలో గాయపడిన ముత్తారం మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఏలువాక కుమార్ ని మాజీ జెడ్పీటీసీ నాగినేని జగన్ మోహన్ రావు మంగళవారం పరామర్శించి, ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ముత్తారంలోని కుమార్ నివాసానికి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి, చికిత్స వివరాలపై ఆరా తీశారు.కుటుంబానికి అండగా ఉంటామని భరోసాఏలువాక కుమార్ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి తన విధుల్లో చేరాలని నాగినేని జగన్ మోహన్ రావు ఆకాంక్షించారు.బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, అవసరమైన సమయంలో అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు,పీఏసీఎస్ డైరెక్టర్ బొల్నేని బుచ్చంరావు,తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతు అవగాహన సదస్సు

ప్రజాపక్షం/ముత్తారం :ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఎల్ నినో ప్రభావం,వర్షాభావ పరిస్థితులు,నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులకు దిశానిర్దేశం చేసేందుకు ప్రత్యేక అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు.బుధవారం ఉదయం 10 గంటలకు పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి అనూష ఒక ప్రకటనలో తెలిపారు.ఈ యాసంగి సీజన్‌లో ఎల్ నినో ప్రభావం వల్ల నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున, వరి పంటకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటల సాగు విధానాలపై రైతులకు వ్యవసాయ అధికారులు సమగ్ర సమాచారాన్ని,సలహాలను అందించనున్నారు.ఈ సదస్సులో ఆరుతడి పంటల వల్ల కలిగే లాభాలు, అందుబాటులో ఉన్న విత్తనాలు,యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తారు.ముత్తారం,పరిసర ప్రాంతాల రైతు సోదరులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,సకాలంలో,అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

బిఆర్ఎస్ నేతలవి దిగజారుడు రాజకీయాలు

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినీత్

ప్రజాపక్షం/ముత్తారం : మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నేతలు విమర్శించడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని ముత్తారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బక్కతట్ల వినీత్ యాదవ్ మండిపడ్డారు. గత బీఆర్ఎస్ పాలనలో మంథని నియోజకవర్గంలో ఇసుక రీచ్‌ల పేరుతో రోడ్లను చిద్రం చేశారని,ఆ గుంతల రోడ్లను మరమ్మతు చేయించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత మంత్రి శ్రీధర్ బాబుదేనని ఆయన స్పష్టం చేశారు.

విద్యార్థుల్లో ప్రజాస్వామ్య స్ఫూర్తి నింపిన మాక్ పార్లమెంట్



ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం : విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు,నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించే లక్ష్యంతో జగిత్యాల ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని పీఎం శ్రీ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం మాక్ పార్లమెంట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ హోదాలైన స్పీకర్,మంత్రులు,అధికార పక్షం, ప్రతిపక్ష సభ్యుల పాత్రలు పోషిస్తూ ప్రశ్నోత్తరాలు, చర్చలు,ప్రజా సమస్యలపై తమ అభిప్రాయాలను పార్లమెంటరీ పద్ధతిలో వ్యక్తపరిచారు. భారత పార్లమెంటు పనితీరు, చట్టాల రూపకల్పన,ప్రజాప్రతినిధుల బాధ్యతలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ప్రజాస్వామ్య అవగాహనతో పాటు నాయకత్వ పటిమ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు దోహదపడింది.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువరైతుల ఆత్మీయ కలయిక



ప్రజాపక్షం /రాయికల్ : జగిత్యాల జిల్లాలోని పలు మండలాల యువ రైతులు మంగళవారం ఒకే చోట ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సమ్మేళనానికి వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. రానున్న ఎలినినో కాలంలో ఎలాంటి పంటలు వేయాలో నీటి అవసరం తక్కువ ఉన్న పంటలను వేయాలని అధికారులు రైతులకు సూచించారు.ఉద్యానవన పంటలకు నీటి అవసరం తక్కువ అని వీటితో నిత్య ఆదాయం ఉంటుందని అన్నారు. యువకులు జిల్లాకే ఆదర్శం మీరు చేస్తున్న కృషి నిజంగా ఆదర్శం అంటూ మహిళా రైతులనుద్దేశించి డి హెచ్ ఓ లత అన్నారు. యువత వ్యవసాయం పై మక్కువ పెంచుకొని సాగులో సాంకేతిక పెంచుకుంటూ లాభాలు పొందాలన్నారు. జిల్లా లోని మల్లపూర్ మండలంలోని ముత్యం పేట,సిర్పూర్ కోరుట్ల మండలం ధర్మారం,సారంగపూర్ మండలం పెంబట్ల, లక్ష్మిదేవిపల్లి ఆలూరు రైతులతో కలిసి జాతీయ ఉత్తమ మహిళా రైతు బండారి విజయ వెంకటేష్ ని సన్మానించారు.ఈ కార్యక్రమం లో ఫ్రెండ్స్ ఫరెవర్ మిత్రబృందం,డి ఏ ఓ భాస్కర్, డి హెచ్ ఓ లత నాబార్డ్ డి డి ఎం దిలీప్ ,సైంటిస్ట్ తిరుపతి,ఏ ఓ ముక్తేశ్వర్,హెచ్ ఈ ఓ అన్వేష్ మాజీ సర్పంచ్ మెక్కొండ రాంరెడ్డి,రాజు,తిరుపతి,శేఖర్,ఆదిరెడ్డి,మల్లారెడ్డి,గంగారెడ్డి,సతీష్,మహిళా రైతులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి రూ.40,336 ఆదాయం



ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామంలోని శ్రీ ఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం (నవంబర్ 3) వివిధ సేవా టికెట్ల విక్రయం, అమ్మవారి హుండీ లెక్కింపు ద్వారా మొత్తం రూ.40,336 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సంగెం సురేందర్ తెలిపారు.దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన లెక్కింపులో వివిధ సేవా టికెట్ల ద్వారా రూ.34,750 ఆదాయం రాగా,అమ్మవారి హుండీ లెక్కింపులో రూ.5,586 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖకు చెందిన వివిధ ఆలయాల సిబ్బంది డిప్యూటేషన్‌పై పాల్గొన్నారు. వారిలో కల్వకుంట్ల అనిల్ రావు, కూకట్ల రాజేందర్, గుంటుక శివకేశవ్,మైత బావాయి ఉన్నారు.మెట్‌పల్లి పోలీసు శాఖ సిబ్బంది భక్తులు,ప్రయాణికులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షించారు.అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వహణ ఏర్పాట్లు చేసినట్లు ఈఓ సంగెం సురేందర్ తెలిపారు.

సర్పంచ్ చొరవతో విద్యుత్ స్తంభాలు,వీధి దీపాల ఏర్పాటు



ప్రజాపక్షం/రామగిరి : రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని గొల్లపల్లె కొండిన్యనగర్ ప్రాంతంలో నూతన మీటర్ కనెక్షన్ పథకం కింద విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన పనులు చేపట్టారు.నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, విద్యుత్ లైన్లు వేయడంతో పాటు వీధి దీపాలను సైతం ఏర్పాటు చేశారు.కల్వచర్ల గ్రామ సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి ప్రత్యేక చొరవతో కొత్త మీటర్ కనెక్షన్ మంజూరు చేయించి, సంబంధిత విద్యుత్ పనులు పూర్తి చేయించి స్థానికులకు విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో గొల్లపల్లె కొండిన్యనగర్ ప్రాంతంలో విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు, వీధి దీపాల ఏర్పాటుతో రాత్రివేళల్లో ప్రజలకు మెరుగైన వెలుతురు అందించనున్నారు.గ్రామంలోని ప్రతి ప్రాంతానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి తెలిపారు. విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చొరవ చూపిన సర్పంచ్‌కు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. లైన్ మెన్ ఆకుల శ్రీనివాస్,వార్డు సభ్యులు,కరెంట్ సిబ్బంది,గ్రామపంచాయతీ సిబ్బంది,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ..విద్యార్థులతో మాట్లాడిన ఎమ్మెల్యే

జగ్గసాగర్,ఆత్మకూర్ పాఠశాలల్లో ఆకస్మిక పరిశీలన



ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి మండలంలోని జగ్గసాగర్,ఆత్మకూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలల్లో విద్యాబోధన, మౌలిక సదుపాయాలు,నిర్వహణ తీరును పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పరీక్షల సన్నద్ధతను తెలుసుకున్నారు.ప్రణాళికాబద్ధంగా చదివి మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు.పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,అధికారులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి ఔదార్యం..

గ్రంథాలయానికి రూ.20 వేల పుస్తకాల వితరణ



ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలోని గురుకుల పాఠశాల గ్రంథాలయానికి 1987 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి శ్రీనివాస స్వామి రూ.20 వేల విలువైన పుస్తకాలను విరాళంగా అందించారు. పూర్వ విద్యార్థులు అల్లూరి మహేందర్ రెడ్డి, సుంకేట గంగాధర్ ద్వారా పాఠశాల ప్రిన్సిపాల్ మాధవీలతకు పుస్తకాలను అందజేశారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలలోని వసతులను పరిశీలించారు.విద్యార్థుల విద్యాభివృద్ధికి, పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పూర్వ విద్యార్థులందరి సహకారంతో కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చేవూరి జీవన్ రెడ్డి పాల్గొన్నారు.పుస్తకాలు అందించిన పూర్వ విద్యార్థులకు ప్రిన్సిపాల్ మాధవీలత కృతజ్ఞతలు తెలిపారు.

ఈత కొడుతూ ప్రమాదవశాత్తు యువకుడు మృతి

ప్రజాపక్షం/గొల్లపల్లి : ఈత కొడదామని బావిలోకి దిగిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన విషాద సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన ఆడెపు మధు (28)మంగళవారం ఉదయం వాకింగ్ నిమిత్తం బయటకు వెళ్ళాడు .ఈ క్రమంలో గంగదేవిపల్లి గ్రామ శివారులో ఉన్న ఒక వ్యవసాయ బావిలో ఈత కొట్టేందుకు దిగాడు.అయితే ఈత కొడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు బావిలోని రాళ్లు అతని తలకు, మోకాలికి బలంగా తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఊపిరాడక అతను నీటిలో మునిగి అక్కడికక్కడే మృతి చెందాడు.ఉదయం వాకింగ్ కు వెళ్లిన కొడుకు శవమై తిరిగి రావడంతో తల్లిదండ్రులు,కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.ఈ సంఘటనపై మృతుడి తండ్రి భూమయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం

స్పందించని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండల ప్రత్యేక అధికారి రవీందర్,ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల సర్పంచులు వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉచిత వైద్య శిబిరాలు ఏవీ? మాజీ ఎంపీపీ చంద్రమౌళి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలో ఉచిత వైద్య శిబిరాలు ఎందుకు నిర్వహించడం లేదని మాజీ ఎంపీపీ,సర్పంచ్ అత్తె చంద్రమౌళి అధికారులను ప్రశ్నించారు. పలు గ్రామాల్లో ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నప్పటికీ వైద్యులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అలాగే మండలంలో విద్యుత్ కోతలు తీవ్రంగా ఉన్నాయని,చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలపై గత సమావేశంలో ఫిర్యాదు చేసినా నేటికీ సమస్య పరిష్కరించలేదని ధ్వజమెత్తారు. జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల పొలాల్లోకి హార్వెస్టర్లు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు వెళ్లేందుకు వీలుగా అండర్ పాస్,ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.



ట్రాన్స్‌ఫార్మర్ల నిర్లక్ష్యంపై సర్పంచుల నిలదీత : గత ఆరు నెలలుగా పారుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శాలగుడపల్లిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల ప్రమాదం పొంచి ఉందని మొత్తుకుంటున్నా అధికారులు స్పందించడం లేదని పారుపల్లి సర్పంచ్ చొప్పరి సంపత్ ఆవేదన వ్యక్తం చేశారు. హరిపురం గ్రామంలో విద్యుత్ సమస్యల కారణంగా వీధి దీపాలు కాలిపోవడం జరిగిందని సర్పంచ్ సమత తిరుపతి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలోని ముత్తారం మండలంలో విద్యుత్ సమస్యలు ఇంత తీవ్రంగా ఉన్నా అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బియ్యాన్ని శివకుమార్ నిలదీశారు.నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మిషన్ భగీరథ నీరు అందడం లేదు : మైదంబండ సర్పంచ్ శివకుమార్ గ్రామంలో మిషన్ భగీరథ నీళ్ల వాటర్ ట్యాంక్ కి ఎక్కడం లేదని,గతంలో అధికారులకు చెప్పినప్పటికీ నేటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదని మైదంబండ గ్రామ సర్పంచ్ శివకుమార్ సమావేశం దృష్టికి తెచ్చారు.ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పైలాన్ తొలగింపుపై నిరసన

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : బీఆర్ఎస్ పార్టీ హయాంలో రామగుండం నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా విడుదలైన నిధులకు నిదర్శనంగా లేబర్ కోర్టు చౌరస్తాలో ఏర్పాటు చేసిన అభివృద్ధి పైలాన్ కట్టడాన్ని మున్సిపల్ అధికారులు తొలగిస్తున్న వైఖరిని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రామగుండం నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు గుర్తుగా, మాజీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా నెలకొల్పిన పైలాన్‌ను అక్రమంగా తొలగించడాన్ని నిరసిస్తూ హరీష్ రెడ్డి ఆందోళన చేపట్టారు. అభివృద్ధి పనులకు నిదర్శనంగా నిలిచిన కట్టడాన్ని తొలగించడం మున్సిపల్ అధికారుల అనాలోచిత చర్యగా ఆయన అభివర్ణించారు.రామగుండం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన చారిత్రక ఆనవాళ్లను తొలగించడాన్ని బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి.ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తూ నాయకులను అరెస్టు చేయడం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు.అభివృద్ధి ఆనవాళ్లను చెరిపివేయాలనే ప్రయత్నాలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని,ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని పార్టీ శ్రేణులు స్పష్టం చేశాయి.

గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో కానిస్టేబుల్ రక్తదానం

ఆపదలో ఆదుకున్న రజిత ఫౌండేషన్

ప్రజాపక్షం/ముత్తారం : గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న ఒక రోగికి రక్తం అవసరమని సమాచారం అందడంతో రజిత ఫౌండేషన్ పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ముత్తారం విభాగం వెంటనే స్పందించింది. ఫౌండేషన్ సభ్యులు ఈ విషయాన్ని గోదావరిఖనిలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రాజేష్‌కు తెలియజేశారు. సమాచారం అందుకున్న వెంటనే ఆయన ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి చేరుకుని రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.సమయానికి స్పందించి ప్రాణదాతగా నిలిచిన కానిస్టేబుల్ రాజేష్‌కు, అలాగే ఇందుకు సహకరించిన రజిత ఫౌండేషన్ ప్రతినిధులకు పేషెంట్ కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

నిరంతరం సేవా పథంలో..: గత కొంతకాలంగా ఎంతో మంది నిరుపేదలకు, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ రజిత ఫౌండేషన్ అనేక సేవా కార్యక్రమాలు



నిర్వహిస్తోంది. కులమతాలకు అతీతంగా,ఆపదలో ఉన్నవారికి నేనున్నానంటూ ముందుకు రావడం ఫౌండేషన్ సేవా స్ఫూర్తికి నిదర్శనంగా నిలుస్తోంది. ఎటువంటి ప్రచార ఆర్భాటాలకు దూరంగా, కేవలం సేవనే పరమావధిగా చేసుకుని మానవత్వాన్ని చాటుతున్న రజిత ఫౌండేషన్ సభ్యుల సేవలు ఎంతో అభినందనీయమని స్థానికులు కొనియాడారు. వారి సేవా నిరతి మరెందరికో ఆదర్శంగా నిలుస్తోందని పలువురు ప్రశంసలు కురిపించారు.

బిఆర్ఎస్ సర్పంచ్‌నైనందుకే జనరల్ బాడీ సమావేశానికి పిలవలేదా?

ప్రజాపక్షం/ముత్తారం : రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే మండల పరిషత్ జనరల్ బాడీ సమావేశానికి తనకు సమాచారం ఇవ్వకుండా విస్మరించారని పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ముత్తారం గ్రామ సర్పంచ్ సుదాటి రవీందర్ రావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ముత్తారంలో విలేకరులతో మాట్లాడారు.నిబంధనల ఉల్లంఘన..పంచాయతీరాజ్ నిబంధనల ప్రకారం మండల పరిధిలోని ప్రజాప్రతినిధులందరినీ జనరల్ బాడీ సమావేశానికి ఆహ్వానించాల్సిన బాధ్యత ఉందని ఆయన గుర్తుచేశారు. సర్పంచ్‌ను అయినందుకే కావాలనే అధికారులు తనకు ఆహ్వానం పంపకుండా వివక్ష చూపారని ఆరోపించారు.

ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు..గ్రామంలోని ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై మండల వేదికపై మాట్లాడే హక్కును కాలరాయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని రవీందర్ రావు మండిపడ్డారు.అధికారుల తీరుపై జిల్లా ఉన్నతాధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయనున్నట్లు సర్పంచ్ సుదాటి రవీందర్ రావు తెలిపారు.



యువతను చిదిమేస్తున్న గుడుంబా,గంజాయి మహమ్మారి

పక్షం/ముత్తారం : గ్రామాల్లో గుడుంబా, గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయని,దీనివల్ల యువత మత్తుకు బానిసై తమ భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని పలువురు సర్పంచులు అధికారుల ఎదుట తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఈ అంశంపై ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు.ముఖ్యంగా మైదంబండ గ్రామంలో గుడుంబా అమ్మకాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ఆ గ్రామ సర్పంచ్ స్వయంగా సమావేశంలో వివరించడం గమనార్హం.ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి, మండలంలోని గ్రామాల్లో గుడుంబా, గంజాయి సాగు, అమ్మకాలను పూర్తి స్థాయిలో నివారించాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు.

అధికారుల నిర్లక్ష్యంపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం : మండల సర్వసభ్య సమావేశానికి ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించిన అధికారులు గైర్హాజరు కావడంపై సమావేశంలో తీవ్ర దుమారం రేగింది. ఇంత ముఖ్యమైన సమావేశానికి రాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సదరు అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని మాజీ ఎంపీపీ,సర్పంచ్ అత్తె చంద్రమౌళి ఎంపీడీవోను నేరుగా ప్రశ్నించారు.



ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

9వ కౌన్సిలర్ తొర్రికొండ ప్రభాకర్

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందజేస్తామని సుల్తానాబాద్ పట్టణంలోని తొమ్మిదవ అవార్డు కౌన్సిలర్ తొర్రగొండ ప్రభాకర్ అన్నారు.పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు ఆదేశాల మేరకు సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీరాంనగర్ గణేష్ మండపం వద్ద మంగళవారం 9వ వార్డు కౌన్సిలర్ తొర్రికొండ ప్రభాకర్ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం, నిత్యావసర సరుకులు,వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి అర్హ కుటుంబానికి చేరవేయడమే తమ లక్ష్యమని,ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని కౌన్సిలర్ తొర్రికొండ ప్రభాకర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జీపీఓ మహేందర్ రెడ్డి,మెంగాని శ్రీనివాస్,తిరుమల,జమున,నల్లవెల్లి రాజమౌళి,నాంపల్లి విజయ్, 9వ వార్డు ప్రజలు,లబ్ధిదారులు,తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆరుతడి పంటలకు విత్తనాల పంపిణీ చేయనున్న ఎమ్మెల్యే

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : సుల్తానాబాద్ మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యం లో పెద్దపల్లి నియోజకవర్గ శాసన సభ సభ్యులు మరియు ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు చేతుల మీదుగా బుధవారం ఉదయం 9.30 గంటలకు సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో 50% సబ్సిడీ పై మొక్కజొన్న ,100 % సబ్సిడీ పై తెల్ల జొన్న విత్తనాలు తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సహకారం తో రైతులకు అందజేయడం జరుగుతుందని సుల్తానాబాద్ మండల వ్యవసాయ అధికారి పై తల్లి తెలిపారు.కావున జొన్న,మొక్కజొన్న సాగుచేయాలనుకునే రైతులు పట్టాదారు పాస్ బుక్,ఆధార్ కార్డు జెరాక్స్ తీసుకొని రాగలరనీ మండల వ్యవసాయ అధికారి పైడి తల్లి కోరారు.

సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ

ప్రజాపక్షం/సుల్తానాబాద్ : పెద్దపల్లి జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వహణ అధికారి కె.నరేందర్ మంగళవారం సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సిబ్బంది ప్రతిరోజూ సకాలంలో కార్యాలయానికి హాజరుకావాలని,ప్రజావాణిలో అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మాణాన్ని ప్రోత్సహించాలని సూచించారు.అలాగే ప్రతి గ్రామంలో పంట కుంటలు,నీటి కుంటల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఉపాధి హామీ పథకం కింద నిర్ణయించిన లేబర్ టార్గెట్‌ను తప్పనిసరిగా చేరుకోవాలని,జాబ్ కార్డులు లేని అర్హులైన వారికి వెంటనే కొత్త జాబ్ కార్డులు జారీ చేయాలని ఆదేశించారు.ఇటీవల మంజూరైన వివో భవనాల నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో ఎంపీడీవో నీలగిరి దివ్యదర్శన్ రావు,ఎంపీఓ ఈ. మౌలిక,కార్యాలయ పర్యవేక్షకులు ఫక్రుద్దీన్,ఏపీవో మల్లీశ్వరి, ఉపాధి హామీ జూనియర్ ఇంజనీర్ రాజ్‌కుమార్ తదితర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు స్వీయ రక్షణ శిక్షణ ఇచ్చేందుకు శిక్షకుల ఎంపిక నిర్వహణ

జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ఎంపిక చేసిన 48 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు స్వీయ రక్షణ శిక్షణ అందించేందుకు గాను శిక్షకులను నియమించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.స్వీయ రక్షణ శిక్షకులుగా నియమించబడేందుకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు నవంబర్ 04న మధ్యాహ్నం 2:00 గంటలకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి హాజరుకావాలని సీనియర్ అధికారుల సమక్షంలో జరిగే ఈ ఎంపిక ప్రక్రియలో అర్హులైన అభ్యర్థులు సకాలంలో హాజరుకావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రేషన్ షాప్, కిరాణా దుకాణాల తనిఖీ



ప్రజాపక్షం/బోధ్ ఃబోధ్ మండల కేంద్రంలో మంగళవారం ఆకస్మికంగా రేషన్ షాపులను కిరాణా దుకాణాలను డిఎస్ఒ నందిని తనిఖీ చేసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకి బియ్యం అమ్మాలి అని, ఒక వేళ ఎక్కువ రేట్ కి అమ్మితే ఫిర్యాదు చెయ్యవచ్చు అని తెలిపారు. రేషన్ షాప్‌లో ఇబ్బంది లేకుండా బియ్యం పంపిణీ చెయ్యాలి అని తెలిపారు. బోథ్ రేషన్ డీలర్ ఉమా, రవీందర్‌లకు పలు సూచనలు అందించారు. కిరాణా దుకాణం వాళ్లు బియ్యం ఎక్కువ ధరకి అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భైంసాలో నేడు ఎస్పి ప్రజావాణి

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ ఃజిల్లా ప్రజల సమస్యలు,ఫిర్యాదులను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఎస్పి డా. జి. జానకి షర్మిల బుధవారం భైంసాలో ప్రజావాణి కార్యక్రమానికి అందుబాటులో ఉండనున్నారు.బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భైంసా క్యాంప్ కార్యాలయంలో ఎస్పి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. పోలీస్ శాఖకు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదులు ఉన్న బాధితులు నేరుగా ఎస్పిని కలిసి తమ సమస్యలను వివరించి వినతిపత్రాలు అందజేయవచ్చని జిల్లా పోలీస్ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకురావాలని పోలీస్ శాఖ కోరింది.ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొంది.


బాధిత కుటుంబాలకు పరామర్శ



ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్ ఃఖానాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను బిఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి భూక్యా జాన్సన్ నాయక్ మంగళవారం పరామర్శించారు.ఎర్వచింతల్ లోని ఇటీవల విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందిన గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికుడు చిట్యాల రాజన్న కుటుంబీకులను పరామర్శించారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని అన్నారు. కుటుంబీకులు మనోధైర్యంతో ఉండాలని బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు.బీర్నంది గ్రామానికి చెందిన కమ్మరి లచ్చన్న, కారుకురి గంగవ్వ లు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యుల్ని కలిసి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులు,మాజీ ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు ఉన్నారు.

వాంకిడి ఎంపిడిఒ కార్యాలయంలో అధికారుల పక్షపాతం!

మీడియాపై వివక్ష.. సర్వసభ్య సమావేశాలకు 'సొంత' వర్గానికే సమాచారం



ప్రజాపక్షం / వాంకిడిఃప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన పత్రికా రంగాన్ని వాంకిడి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ అధికారులు తమ స్వార్థ రాజకీయాల మాదిరిగా విభజిస్తున్నారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తెస్తూ, అధికార యంత్రాంగానికి ప్రజలకు మధ్య వారధిగా నిలిచే మీడియా ప్రతినిధుల పట్ల అధికారులు బాహాటంగానే పక్షపాతం ప్రదర్శిస్తుండటం మండలంలో తీవ్ర దుమారం రేపుతోంది. ప్రభుత్వ నిధులు, గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యలపై చర్చించే అత్యంత కీలకమైన సర్వసభ్య సమావేశాల వివరాలను అత్యంత రహస్యంగా కొందరికే పరిమితం చేస్తూ అధికారులు సాగిస్తున్న లీలలు విమర్శలకు తావిస్తున్నాయి. మండలంలో నెలకొన్న సమస్యలపై నిరంతరం గళమెత్తుతూ అధికారుల దృష్టికి తీసుకెళ్లే నిజాయితీగల విలేకరులను ఉద్దేశపూర్వకంగానే సమావేశాలకు దూరం పెడుతున్నారు. తమ తప్పులను ప్రశ్నించకుండా అనుకూలంగా ఉండే కొద్దిమంది మీడియా ప్రతినిధులకు మాత్రమే ముందస్తు ఆహ్వానాలు పంపుతూ, సమాచారాన్ని అరచేతిలో దాచే ప్రయత్నం చేస్తున్నారు. చివరకు సమాచార పౌరసంబంధాల శాఖ జారీ చేసిన ప్రభుత్వ గుర్తింపు (అక్రిడిటేషన్) కలిగిన జర్నలిస్టులను సైతం నిర్లజ్జగా విస్మరిస్తుండటం అధికారుల బరితెగింపునకు నిదర్శనంగా మారింది. స్థానికంగా జర్నలిస్టుల మధ్య విభేదాలు, వర్గాలు ఉన్నాయనే సాకును అడ్డం పెట్టుకుని, ఒక వర్గానికే అధికారులు కొమ్ముకాయడం వెనుక అంతర్యమేమిటని సర్వత్రా ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. మండల సర్వసభ్య సమావేశం అనేది అధికారుల వ్యక్తిగత వ్యవహారం కాదు. ప్రజా ప్రతినిధులు లేవనెత్తే ప్రజా సమస్యలు, వాటిపై అధికారులు ఇచ్చే సమాధానాలు ప్రజలందరికీ తెలియాలి. కానీ సమావేశం ఎప్పుడు జరుగుతోంది? అజెండా ఏమిటి? అనే కనీస వివరాలను దాచిపెట్టి, అంతా ముగిశాక మొక్కుబడిగా తూతూమంత్రంగా సమాచారం ఇస్తుండటంతో జర్నలిస్టుల హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతోంది. వ్యక్తిగత పరిచయాలు, అనుకూలతలను బట్టి ప్రభుత్వ కార్యాలయ సమాచారాన్ని పంపిణీ చేయడం పరిపాలనా పారదర్శకతకే గొడ్డలిపెట్టుగా మారింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, ఎంపిడిఒ కార్యాలయంలో సాగుతున్న వివక్షాపూరిత వైఖరిపై తక్షణమే విచారణ జరపాలని, సమావేశాల సమాచారాన్ని మీడియా ప్రతినిధులందరికీ సమానంగా, ముందస్తుగా అందించేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని స్థానిక పాత్రికేయులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

అన్ని సంఘాలతో సమానంగా చర్చించాలి

ఐఎఫ్‌టియు నాయకులు



ప్రజాపక్షం / శ్రీరాంపూర్ఃసింగరేణిలో గుర్తింపు సంఘం కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో వెంటనే ఎన్నికలు నిర్వహించాలని, అప్పటివరకు అన్ని కార్మిక సంఘాలతో సమానంగా చర్చలు జరపాలని ఐఎఫ్‌టియు నాయకులు డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్‌లోని గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం కార్యాలయంలో మంగళవారం సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిఎల్‌బికె ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.కృష్ణ మాట్లాడుతూ గుర్తింపు సంఘం గడువు సెప్టెంబర్ 9తో ముగిసినందున యాజమాన్యం జాప్యం చేయకుండా ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఎన్నికలు జరిగే వరకు గతంలో పోటీ చేసిన అన్ని సంఘాలకు సమాన హోదా కల్పించి చర్చలకు ఆహ్వానించాలన్నారు. అనంతరం ఎస్‌సిసిడబ్ల్యుయు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి.బ్రహ్మానందం మాట్లాడుతూ సింగరేణి అన్వేషించిన బొగ్గు బ్లాకులను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు వేలం వేయడం కార్మికులకు తీవ్ర నష్టదాయకమన్నారు. ముఖ్యంగా శ్రావణపల్లి బొగ్గు బ్లాక్ వేలం వల్ల స్థానిక నిరుద్యోగులు అవకాశాలు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. బొగ్గు బ్లాకులన్నింటినీ సింగరేణికే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లపల్లి శ్రీనివాస్, ఎండి.జాఫర్, పోతుల కిష్టయ్య, జగన్నాథ్ సంతోష్, భీముని పోషం, కామెళ్ల దేవయ్య, గజ్జి మల్లేష్, కొలిపాక సదానందం, శంకరి సత్యం పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తితో అధిక దిగుబడులు

శాస్త్రవేత్త ప్రియాంక్ గైక్వాడ్



ప్రజాపక్షం / మందమర్రిఃపత్తి సాగులో ఆధునిక పద్ధతులు అవలంబిస్తూ తక్కువ విస్తీర్ణంలో అధిక దిగుబడులు సాధించేందుకు అధిక సాంద్రత సాగు విధానం ఎంతో మేలని నాగ్‌పూర్ కాటన్ డెవలప్‌మెంట్ డైరెక్టరేట్ సీనియర్ శాస్త్రవేత్త ప్రియాంక్ గైక్వాడ్ సూచించారు. కేంద్ర ప్రభుత్వ కపాస్ క్రాంతి పథకంలో భాగంగా మందమర్రి మండలం అందుగులపేటలో రైతు ఏనుగు ఆశిరెడ్డి సాగు చేసిన అధిక సాంద్రత పత్తి క్షేత్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. పంట ఎదుగుదల, దిగుబడి అంచనాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరాకు 24 వేల మొక్కలు నాటి, తగిన పోషకాలు అందిస్తూ మెపిక్వాట్ క్లోరైడ్‌తో పెరుగుదలను నియంత్రిస్తే ఎకరాకు 15 క్వింటాళ్ల వరకు దిగుబడి సాధించవచ్చని తెలిపారు. రైతులు సాంప్రదాయ పద్ధతులు వీడి ఈ విధానాన్ని అవలంబించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎల్తూరి సురేఖ, ఎడిఎ బానోత్ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి జి.కిరణ్మయి, ఎఇఒ సైండ్ల కనకరాజు, రైతులు పాల్గొన్నారు.

కాషాయ జెండాలతో జనసంద్రంగా నిర్మల్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ ఃనిర్మల్ పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా పాదయాత్రకు వేలాదిగా ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివచ్చారు. కాషాయ జెండాలతో పట్టణ వీధులు జనసంద్రంగా మారాయి.ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్, ఇండీ కూటమి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలనే నినాదంతో ఈ పాదయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రూ.4 వేల పింఛన్,నిరుద్యోగులకు ఉద్యోగాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు భరోసా వంటి హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు.

ఘనంగా డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం



ప్రజాపక్షం / వాంకిడిఃవాంకిడి మండలంలోని ఖిరిడి గ్రామంలో మంగళవారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాయకులు సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి దుర్గం నిఖిల్ మాట్లాడుతూ 1980 నవంబర్‌లో ఏర్పాటైన డివైఎఫ్ఐ నేటికీ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన కోసం నిరంతరాయంగా పోరాటాలు చేస్తోందని తెలిపారు. యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా యువత ఐక్యంగా ఉంటూ సమాజంలో సోదరభావం, శాంతి, సామరస్యం పెంపొందించేందుకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారంలో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్, నిఖిల్, రాజ్‌కుమార్, యాదవ్, తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు

సిఐ కృష్ణ



ప్రజాపక్షం / కోటపల్లిఃగుడుంబా తయారీకి పాల్పడినా, గంజాయి విక్రయించినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని చెన్నూర్ రూరల్ సిఐ కృష్ణ హెచ్చరించారు. కోటపల్లి మండలం అలుగామ గ్రామంలో మంగళవారం పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించారు. గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడుతున్న దుర్గం స్వామి, రమేష్, దాగం గోపాల్‌పై కేసులు నమోదు చేశారు. నిందితుల నుంచి 25 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, సుమారు 2 వేల లీటర్ల బెల్లం పాసకాన్ని ధ్వంసం చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో సరైన పత్రాలు లేని 40 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ కొద్దిపాటి డబ్బు కోసం కుటుంబాల జీవితాలతో చెలగాటమాడవద్దని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ దాడుల్లో కోటపల్లి ఎస్ఐ రాజశేఖర్, నిల్వాయి ఎస్ఐ నాగరాజు, ఎక్సైజ్ ఎస్ఐ సాయి, పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



ప్రజాపక్షం / వాంకిడిఃవాంకిడి మండలంలోని బంబారా న్యూ కాలనీలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఒరిగిపోయి కూలేందుకు సిద్ధంగా ఉండటంతో స్థానికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని నివాసాల మధ్య నుంచి వెళ్లే సిసి రోడ్డు పక్కనే ఉన్న ఈ స్తంభం ఒకవైపునకు బాగా వంగిపోయింది. నిత్యం పాఠశాల విద్యార్థులు, మహిళలు, వృద్ధులు రాకపోకలు సాగించే రద్దీ మార్గంలో ఇది ఉండటంతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్తంభంపై విద్యుత్ తీగలు వేలాడుతుండటంతో పెను ప్రమాదం పొంచి ఉందని వాపోతున్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగి ప్రాణనష్టం జరగకముందే విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి వంగిన స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కెజిబివిలో తీగ మొక్కలతో భయం భయం

ప్రజాపక్షం/నేరడిగొండ: నేరడిగొండ కెజిబివి భవనంలో కింది నుంచి రెండో అంతస్తు వరకు పిచ్చి తీగలు అల్లుకోవడంతో విద్యార్థినులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రహారీ గోడలతో పాటు భవనంపై తీగలు పెరిగిపోవడంతో పాములు, విషకీటకాలు పైకి వచ్చే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి తీగలు, పిచ్చి మొక్కలను తొలగించి భద్రత కల్పించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

ప్రజాపక్షం/నేరడిగొండ: మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కంటి ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చేయూత ఫౌండేషన్ చైర్మన్ ఎన్‌టి రమణ ఒక ప్రకటనలో తెలిపారు. 5న నేరడిగొండ మండలంలోని గాజిలీ గ్రామంలో ఈ ఉచిత కంటి పరీక్షల కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మారుమూల గ్రామాల విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. వివరాలకు 9948063051 నెంబరులో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

పత్తి ధర పతనం



ప్రజాపక్షం/మావల: ఆదిలాబాద్ మార్కెట్ యార్డ్‌లో రోజు రోజుకూ పత్తి ధరలు తగ్గిపోతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముహూర్తం రోజున క్వింటాలు పత్తికి రూ.9260 ఇచ్చిన ప్రైవేట్ వ్యాపారులు, మంగళవారం నాటికి రూ. 8780కి తగ్గించారు. ప్రైవేట్ వ్యాపారుల వ్యామోహాన్ని ఆసరాగా చేసుకుని ధరలు తగ్గిస్తున్నారని, అధికారులు స్పందించి గిట్టుబాటు ధర దక్కేలా చూడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

దంచి కొట్టిన వాన

ప్రజాపక్షం/నేరడిగొండ: నేరడిగొండ మండల కేంద్రంలో మంగళవారం గంట పాటు భారీ వర్షం కురిసింది. గత మూడు నెలలుగా వర్షాలు లేక అవస్థలు పడుతున్న రైతులు ఈ వర్షంతో హర్షం వ్యక్తం చేశారు. మురుసు తుఫాను ప్రభావంతో మరిన్ని వర్షాలు కురిసి కరువు నుంచి గట్టెక్కుతామని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విద్యాప్రమాణాల పెంపుదలకు కృషి

ప్రజాపక్షం/బాల్కొండ : విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు సమన్వయంతో కృషి చేయాలని బాల్కొండ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బట్టు రాజేశ్వర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు బాల్కొండ, ముప్కాల్ మండలాలకు చెందిన సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్యార్థులకు మిడ్‌లైన్ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో ఏవిధంగా నిర్వహించాలని, డెమో యాప్‌ను ఎలా ఉపయోగించాలనే అంశాలపై ఉపాధ్యాయులకు క్షుణ్ణంగా శిక్షణనిచ్చారు. అదేవిధంగా డెమో యాప్‌ను ఎలా ఉపయోగించాలనే అంశాలపై ఉపాధ్యాయులకు క్షుణ్ణంగా శిక్షణనిచ్చారు. నూతన బోధనా పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకుని విద్యార్థుల అభ్యసన ఫలితాలను మెరుగుపర్చాలని ప్రతి విద్యార్థి విద్యా పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

విశ్వనాథ ఆలయ పునర్‌నిర్మాణం పనులు పరిశీలన



ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : మంచిర్యాల పట్టణంలో భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన శ్రీ విశ్వనాథ ఆలయాన్ని మరింత వైభవంగా పునర్‌నిర్మించాలనే సంకల్పంతో చేపట్టిన పనుల్లో భాగంగా ఆలయ పునర్‌నిర్మాణ పనులను మంగళశారం మంచిర్యాల శాసనసభ్యుడు కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పర్యవేక్షించారు. పట్టణ వాసుల చిరకాల ఆకాంక్ష అయిన విశ్వనాథ ఆలయాన్ని అన్ని రకాల ఆధ్యాత్మిక వైభవంగా ఉండేవిధంగా భక్తులకు మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు పోతున్నట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. మంచిర్యాల పట్టణంలో ఆరవై సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేసి భక్తుల దర్శనార్థం అన్ని వసతులు కల్పిస్తామని అన్నారు. అలాగే మంచిర్యాల గోదావరి తీరంలోని మహాప్రస్థానంను కూడా ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, ఇఒ రవి, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముల నరేష్, మార్కెట్ కమిటి చైర్మన్ రామగిరి బానేష్, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ గుండ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాణాసంచా స్టాల్లపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి

అన్ని భద్రతా ప్రమాణాలుంటేనే అనుమతులివ్వాలి : ప్రజల విజ్ఞప్తి



ప్రజాపక్షం/ఆర్మూర్: దీపావళి పండగ సమీపిస్తున్న నేపథ్యంలో ఆర్మూర్ మున్సిపల్ కేంద్రంలోని తాత్కలిక బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు మున్సిపాలిటీ అనుమతులు జారీ చేస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు. బాణాసంచా దుకాణాల వద్ద అగ్నిప్రమాదాలు నివారణకు అవసరమైన అన్ని భద్రతా ఏర్పాట్లు ఉన్నాయో లేదో సమగ్రంగా పరిశీలించిన తర్వాతే అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ముఖ్యంగా ఫైర్ సేఫ్టీ అధికారులు రంగంలోకి దిగి తాత్కలిక బాణాసంచా దుకాణాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయాలని ఆ ప్రాంతంలో ఫైర్ ఇంజన్ అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. అగ్నిమాపక పరికరాలు, ప్రమాద నివారణకు చర్యలు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా రాకపోకలకు ఆటంకం లేకుండా ఉండే ఏర్పాట్లను పరిశీలించాలని సూచిస్తున్నారు. నిబంధనలకనుగుణంగా అన్ని సదుపాయాలున్న దుకాణాలకే అనుమతులు మంజూరు చేయాలని, భద్రతా ప్రమాణాలు పాటించని దుకాణాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పండగ వేళ ఎలాంటి అగ్నిప్రమాదాలు జరగకుండా మున్సిపల్, ఫైర్ సేఫ్టీ అధికారులు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తాగునీటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు

మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ఎల్ నినో ప్రభావంతో రానున్న వేసవిలో నిర్మల్ పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి తెలిపారు. పట్టణానికి తాగునీరు అందించే ఎస్‌ఆర్‌ఎస్‌పి ప్రాజెక్టును ఆయన అధికారులతో కలిసి సందర్శించి, ప్రస్తుత నీటి నిల్వలు, వేసవిలో నీటి సరఫరా పరిస్థితిపై సమీక్షించారు.ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుత నీటి మట్టాన్ని పరిశీలిస్తే పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలిగే అవకాశాలు లేవని,వేసవి అవసరాలకు సరిపడా నీరు అందుబాటులో ఉందని తెలిపారు. ఒకవేళ అనుకోని పరిస్థితుల్లో నీటి నిల్వలు తగ్గినప్పటికీ,ఆ పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలపై అధికారులతో చర్చించినట్లు పేర్కొన్నారు. ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రజలు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా తాగునీటి పైపులైన్లలో లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడైనా నీటి లీకేజీలు గుర్తించినట్లయితే వెంటనే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.వేసవిలో ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించేందుకు మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నీటి వృథాను అరికట్టేందుకు ప్రజలు కూడా సహకరించాలని అప్పాల గణేష్ చక్రవర్తి విజ్ఞప్తి చేశారు. అతని వెంట కౌన్సిలర్లు గోపు గోపి, పెండం శ్రీనివాస్, ందేడపు చిన్ను, రఫీ, చెనిగరపు నరేష్, శ్రీకాంత్ యాదవ్, డిఇ హరిభువన్ పాల్గొన్నారు.

పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం ఇవ్వాలి

సిపిఐ జిల్లా కన్వీనర్ ఎస్ విలాస్



ప్రజాపక్షం/ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పత్తి పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాల ప్రాతిపదికన కాకుండా కనీసం రూ. 50, 000 చొప్పున నష్టపరిహారం అందించాలని సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ విలాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ రూరల్ మండల పరిధిలోని అంకొలి, లోకారి, వాన్‌వాట్, లింగుగూడ, మామిడిగూడ, పిప్పల్ ధరి, ధహిగూడ, రాజర్షిషాగూడ గ్రామాల్లో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, పార్టీ బృందంతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పొలాల్లోకి వెళ్లి పత్తి మొక్కలను పరిశీలించి, రైతులను నేరుగా కలిసి దిగుబడులు, పెట్టుబడి ఖర్చులు, దళారుల దోపిడి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ విలాస్ మాట్లాడుతూ ఒక్కో పత్తి మొక్కకు కనీసం మూడు నాలుగు కాయలు కూడా లేవని, పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేక రైతాంగం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం అధికారుల నివేదికలకే పరిమితం కాకుండా ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి బాధ్యులైన రైతులను ఆదుకోవాలని కోరారు. జిల్లాలోని కరువు పరిస్థితులు, పంట నష్టాలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టనున్న కరువు యాత్రను రైతులు, శ్రామికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ యాత్రకు పార్టీ రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. దహిగూడ గ్రామంలో ఆదివాసీలు నిర్వహించిన దండారీ వేడుకల సందర్భంగా విలాస్, సిర్ర దేవేందర్‌లు సంప్రదాయ దుస్తులు ధరించి గుస్సాడీ నృత్యంలో పాల్గొన్నారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించాలని కోరారు.

నట్టల నివారణ మందు పంపిణీ



ప్రజాపక్షం/మాక్లూర్ : మండలంలోని మాదాపూర్, వేణుకిసాన్ తండా, ముల్లంగి, బోంకన్‌పల్లి, గుంజిలి గ్రామాల్లో పశు వైద్యశాఖ ఆధ్వర్యంలో దూడలకు నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా 187 దూడలకు నట్టల నివారణ మందు వేశామని పశు వైద్యాధికారిని ఉమామనహేర తెలిపారు. దూడలకు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులు వేశామని, అంతర్గత పరాన్నజీవుల నివారణ జరిగి, జీర్ణశక్తి మెరుగుపడి దూడలు ఆరోగ్యంగా పెరిగి మంచి ఎదుగుదల సాధిస్తాయని తెలిపారు. అలాగే వీబీజీ రాంజీ పథకం కింద వ్యక్తిగత పశుగ్రాస సాగు చేపట్టాలని రైతులకు సూచించారు. పశువులకు నాణ్యమైన పచ్చిమేత అందించడంతో పాల ఉత్పత్తి పెంచుకోవచ్చని పశువుల ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రవి, గోపి, వినీత, కళ్యాణి, శ్యామల, గంగాధర్, సుధీర్ పాల్గొన్నారు.

టోల్‌ఫ్రీ నెంబర్లతో కూడిన జ్యూట్ బ్యాగ్‌ల పంపిణీ



ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి : మండలంలోని బషీరాబాద్ గ్రామంలో మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావోలో భాగంగా మంగళవారం భీమ్‌గల్ ప్రాజెక్టు పరిధిలోని బషీరాబాద్ ఉన్నత పాఠశాలలో బాలికలకు టోల్‌ఫ్రీ నెంబర్లతో కూడిన జ్యూట్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రతతో పాటు సమాన అవకాశాలు కల్పించాలని, బాలికల పట్ల సమానత్వ భావనను ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ టోల్‌ఫ్రీ నెంబర్స్‌తో కూడిన జ్యూట్ బ్యాగ్స్‌ని అందజేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ జ్ఞానేశ్వరి, సూపర్‌వైజర్ అరుణకుమారి, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ స్వప్న, హెచ్‌ఎం గంగాధర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు

ఉప్పూర్ విద్యార్థికి టిఎస్ సెట్‌లో రాష్ట్రస్థాయి ప్రథమస్థానం



ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి : మండలంలోని ఉప్పూర్‌కు చెందిన ఆకుల రామ సాయి విద్యారంగంలో వరుస విజయాలు సాధిస్తూ గ్రామానికి గర్వ కారణంగా నిలిచారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆకుల రాజేశ్వర్, ఆకుల లక్ష్మీ దంపతుల కుమారుడైన రామసాయి టిఎస్‌సెట్ 2022లో 212 మార్కులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలిజిబిలిటీ టెస్ట్‌లో ఓపెన్ కేటగిరిలో అర్హత సాధించారు. ఇటీవల నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్షలు 300 మార్కులకు 178 మార్కులు సాధించి 99.44 పర్సంటైజీతో జెఆర్ఎఫ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత సాధించారు. విద్యారంగంలో వరుస విజయాలు సాధిస్తున్న రామసాయిని ఉప్పూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ శైలేందర్, ఉపసర్పంచ్ శేఖర్, సౌందరయ్య, భాస్కర్, నరేష్, భాస్కర్, నరేష్, సురేష్, అనిల్, రాకేష్, అజయ్, సాదుల్లా, శేఖర్, నిఖిల్, సోను, నరేషపాల్గొన్నారు.

ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ వేడుకలు

ప్రజాపక్షం/నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా అంటేనే కళాకారుల ఐక్యతకు మారుపేరని అధ్యక్ష, కార్యదర్శులు ఆర్టీసీ శ్రీనివాస్ అష్ట గంగాధర్ అన్నారు. తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ వేడుకలు సిరిసిల్ల పట్టణంలో నిర్వహించగా మంగళవారం ధూమ్‌ధాం, జానపద కళాకారులు బస్సులో బయల్దేరారు. సినీ ఇండస్ట్రీతో పాటు ఫోక్ ఇండస్ట్రీకి ఆదరణ పెరుగుతున్న సమయంలో సిరిసిల్లలో ఆవిర్భావ వేడుకలు నిర్వహించటం శుభపరిణామమన్నారు. జిల్లాలో కూడా మంచి కళాకారులున్నారని రానున్న రోజుల్లో మంచి పాటలు చేయాలని కోరుకుంటున్నామన్నారు. ఈ బస్సు యాత్రలో కోశాధికారి రాంపూర్ సాయి, కళాకారులు సాయి, గోదావరి, రాజు, ప్రశాంత్ రెడ్డి, కర్క రమేష్, మీనా, గోపి, మనోజ,నమత, రాజేందర్, మహేందర్, సంతోష్, సాయి, మహేష నరేష్, శ్రావణ్, రాజు బయల్దేరారు.

అండర్ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి హామీ



ప్రజాపక్షం / మానకొండూర్ : మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్ గ్రామంలోని ఎన్‌హెచ్ 563 రహదారిపై అండర్ పాస్ వద్ద డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని కోరుతూ గ్రామ రైతులు అధికారులకు గ్రామ సర్పంచ్ ఎరుకల శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ మేకల మహేందర్ విన్నవించుకున్నారు. డ్రైనేజీ విషయం ఎన్‌హెచ్ 563 అధికారులకు విషయం తెలియజేయగా మంగళవారం సర్పంచ్ ఆధ్వర్యంలో రైతులు అధికారులను కలిసి తమ సమస్యను వివరించారు. ఈ సందర్భంగా స్పందించిన అధికారులు పీడీ భరద్వాజ్ గ్రామానికి వచ్చి అండర్‌పాస్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

క్రీడల్లో సత్తా చాటిన కవలలు

ప్రజాపక్షం / గంగాధర : జిల్లాస్థాయిలో నిర్వహించిన చిత్ర లేఖన పోటీల్లో టిజీఎంఎస్ మోడల్ స్కూల్ గంగాధర పాఠశాల విద్యార్థిని రావుల సాగ్వి ప్రథమ బహుమతి సాధించి తన అద్భుత ప్రతిభను చాటుకుంది. చిన్న వయస్సులోనే చిత్ర లేఖనంలో అసాధారణ నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో కూడా టీజీఎంఎస్ గంగాధర పాఠశాల జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి విజేతగా నిలిచింది. ఈ జట్టులో చిత్ర లేఖన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన రావుల సాగ్వితోపాటు కవల సోదరి రావుల స్నిగ్ధ సభ్యులుగా ఉండడం విశేషం. ఒకే కుటుంబానికి చెందిన కవల సోదరీమణులు వివిధ రంగాల్లో తమ సత్తాను చాటుకుంటూ పాఠశాలకు గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని ఉపాధ్యాయురాలు పేర్కొన్నారు. విద్యతోపాటు క్రీడలు, కళా రంగాల్లోనూ విద్యార్థులు రాణించేలా పాఠశాలలో ప్రోత్సాహం అందిస్తున్నామని ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు క్రీడా నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రత్యేక శిక్షణ, ప్రోత్సాహం అందించడం వల్లే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ పద్మ, వైస్ ప్రిన్సిపల్ మురళీ కృష్ణ, పీడీ నాగరాజు, ఉపాధ్యాయులు కవలలను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో ఇలాంటి విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ముధోల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పిస్తాం

కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజాపక్షం/ముధోల్ : ముధోల్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో (సీహెచ్‌సీ) వైద్య సేవలను మరింత మెరుగుపరిచి, రోగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. మంగళవారం ఆయన ముధోల్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి,ఆసుపత్రిలోని వివిధ విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది సంఖ్య, ప్రతిరోజూ చికిత్స కోసం వస్తున్న రోగుల వివరాలు, వారికి అందిస్తున్న వైద్య సేవల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం రక్త పరీక్షల గది, మందుల పంపిణీ కేంద్రం తదితర విభాగాలను పరిశీలించి, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్యం అందించాలని వైద్యులు,సిబ్బందిని ఆదేశించారు.రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వైద్య సేవలు, మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు.ఆసుపత్రి భవనం పాతదైనందున అవసరమైన మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఆసుపత్రిలో మార్చురీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, నూతన ఆసుపత్రి భవన నిర్మాణానికి సంబంధించి ఉన్నతాధికారులతో సంప్రదించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఈ తనిఖీలో డీసీహెచ్ఎస్ కాశీనాథ్, తహసీల్దార్ శ్రీలత, సర్పంచ్ షబానా బేగం, ఇతర అధికారులు, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మేట్ల విధులు, బాధ్యతలపై శిక్షణ

డిఆర్‌డిఒ విజయలక్ష్మి



ప్రజాపక్షం/దిలావర్ పూర్ : వీబీ–జి రామ్ జీ పథకం అమలులో మేట్ల కీలక పాత్ర పోషించాలని, కూలీలకు నిరంతర ఉపాధి కల్పించడంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన వేతనం సకాలంలో అందేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి సూచించారు.మంగళవారం దిలావర్‌పూర్ మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన మేట్ల శిక్షణ కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన కూలీలకు పని కల్పించడం,హాజరు నమోదు, పని పురోగతిని పర్యవేక్షించడం,నిర్దేశిత పని కొలతల ప్రకారం మార్కింగ్ ఇవ్వడం వంటి అంశాల్లో మేట్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కూలీలకు పథకంపై అవగాహన కల్పిస్తూ,వారి హక్కులు, బాధ్యతలను వివరించాలని సూచించారు. పనుల నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూడాలన్నారు.ఈ సందర్భంగా ఎపిఒ దివ్యారెడ్డి పథకం అమలు విధానం,మేట్లు నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై క్షుణ్ణంగా వివరించారు.టెక్నికల్ అసిస్టెంట్లు వెంకటరమణ, వెంకట్ రామ్ పనుల స్వభావం, పని కొలతలు, కూలీలకు పని ప్రదేశంలో మార్కింగ్ ఇచ్చే విధానం, నిర్దేశిత పని పరిమాణాన్ని పూర్తి చేసే అంశాలపై ప్రాయోగిక శిక్షణ అందించారు.ఈ కార్యక్రమంలో మేట్లతో పాటు మండలం లోని అన్ని గ్రామపంచాయితీల ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నిరాధారమైన ఆరోపణలు చేస్తే ఊరుకోం

బిజెపి కార్పొరేటర్లు బండారి వేణు, సోమిడి వేణు



ప్రజాపక్షం / కొత్తపల్లి : గత బిఆర్ఎస్ పాలకవర్గంలో కొంతమంది చేసిన అవినీతిని ఆధారంగా మా నాయకులు బండి సంజయ్ కుమార్ బిజెపి పార్టీ అంతర్గత సమావేశంలో మా పాలకవర్గానికి హితబోధ, దిశానిర్దేశం చేసిన మాటలను వక్రీకరించి బిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్ నిరాధారమైన ఆరోపణలతో మా పాలకవర్గానికి అవినీతి అంటగట్టే ప్రయత్నం చేయడం సిగ్గుచేటని భారతీయ జనతా పార్టీ కార్పొరేటర్లు బండారి వేణు, సోమిడి వేణు విరుచుకుపడ్డారు. కరీంనగర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత పాలకవర్గంలో అవినీతికి పాల్పడిన కొంతమంది కార్పొరేటర్లను పెంచి పోషించింది మీ నాయకుడు కాదా అని ప్రశ్నించారు. నగరపాలక సంస్థ పాలక వర్గ పరిపాలనలో కొంతమంది కార్పొరేటర్లు అవినీతి,భూకబ్జాలకు పాల్పడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసిన చరిత్ర మీకు కాక ఇంకెవరికి దక్కుతుందని విమర్శించారు. మీ నాయకుడి పాలకవర్గంలో కొంత మంది కార్పొరేటర్లు చేసిన అవినీతిని, భూ కబ్జాలను దృష్టిలో పెట్టుకొని మా నాయకుడు బండి సంజయ్ మా పాలకవర్గానికి హితబోధ, దిశానిర్దేశం చేస్తే మీరు వక్రీకరించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. మీ హయాంలో ఆరాచకాలు చేసిన కార్పొరేటర్లు జైలుపాలు అయిన సంగతి మరిచిపోయారా అని గుర్తు చేశారు. మీ నాయకుని ఉనికిని కాపాడుకోవడం కోసం మా నాయకునిపై నిరాధారమైన అరోపణలు చేస్తే చూస్తు ఊరుకోమని హెచ్చరించారు. గతంలో బిఆర్ఎస్ కార్పొరేటర్లు ప్రతి నివాసం వద్ద డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. అవినీతి అనే పదానికి పర్యాయ పదాలు ఉంటే దానికి కేరాఫ్ చల్ల హరిశంకర్, రవీందర్ సింగ్‌లేనని మండిపడ్డారు. ఈ సమావేశంలో బిజెపి కార్పొరేటర్లు, కోఆప్షన్ మెంబర్లు తాటి ప్రభావతి, దేశ శిల్ప వేదం, పెద్దపల్లి శ్రీలేఖ జితేందర్, బండ రమణ రెడ్డి, ప్రకాశ్, వంగల పవన్, మేకల వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలపై సివిల్ సప్లయ్ అధికారుల తనిఖీ



ప్రజా పక్షం/ఖానాపూర్ : ఖానాపూర్ పట్టణంలోని రేషన్ దుకాణాలపై సివిల్ సప్లయ్ అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. పట్టణంలోని పద్మావతి నగర్ కాలనీలోని రేషన్ దుకాణాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసిల్దార్ (డిటి) రవీందర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.తనిఖీ సందర్భంగా దుకాణంలో నిల్వ ఉన్న బియ్యం,పప్పు,నూనె తదితర సరుకుల నిల్వలను, స్టాక్ రిజిస్టర్‌ను,లబ్ధిదారులకు జరుగుతున్న పంపిణీ వివరాలను,ఈపాస్ మిషన్ రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు సకాలంలో,సరైన కొలతలతో సరుకులు అందించాలని,పంపిణీలో ఎలాంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీలర్‌ను హెచ్చరించారు. బయోమెట్రిక్ తప్పని సరిగా తీసుకోవాలని, అధిక ధరలు వసూలు చేయవద్దని సూచించారు.ఈ తనిఖీలో స్థానిక కౌన్సిలర్ నిమ్మల రమేష్‌తో పాటు సివిల్ సప్లై సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి పల్లెనిద్ర



ప్రజాపక్షం/ఆర్మూర్ : ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ప్రజలకు మరింత చేరువ కావటం, వారి కష్టసుఖాలను స్వయంగా తెలుసుకోవటం లక్ష్యంగా పల్లెనిద్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మండలంలోని గగ్గుపల్లి గ్రామంలో సోమవారం తొలి పల్లెనిద్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో రాత్రికి బస చేసి పొద్దున లేచి ఊరంతా సైకిల్‌పై కలియతిరుగుతూ ప్రజలతో నేరుగా మమేకమవుతూ వారి సమస్యలు, ఇబ్బందులు, స్థానికంగా నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకుంటున్నారు. గతంలో తన పాలనలో ఏవైనా తప్పులు, లోటుపాట్లు జరిగి ఉంటే వాటిని గుర్తించి సరిదిద్దుకుంటానని, ప్రజల అభిప్రాయలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతానని సంకేతాన్ని ఈ కార్యక్రమం ద్వారా ఇస్తున్నారు. గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు పెంచుకోవటం, వారి నమ్మకాన్ని తిరిగి పొందటం లక్ష్యంగా చేపట్టిన ఈ పల్లెనిద్ర కార్యక్రమం ఆర్మూర్ రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ప్రీ ప్రైమరీ డిస్‌ప్లే డే వేడుక



ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్ : కరీంనగర్ హనుమాన్‌నగర్‌లోని బ్లూబెల్స్ ఇన్నోవేటివ్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ప్రీ ప్రైమరీ డిస్‌ప్లే డే కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, స్టోరీ టెల్లింగ్, థీమ్ ప్రాజెక్టులు లిటరసీ కార్నర్స్, నంబర్ఫన్ జోన్ తదితర అంశాలను ప్రదర్శించి తమ ప్రతిభను చాటుకున్నారు. తమ ప్రాజెక్టుల గురించి చిన్నారులు ధైర్యంగా వివరించడం విశేషంగా ఆకట్టుకుందని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ అండ్ చైర్మన్ జంగా సునీత మనోహర్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారుల్లో సృజనాత్మకత, ఆత్మ విశ్వాసం, భావ వ్యక్తీకరణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయని అన్నారు. మెలు స్పార్క్ స్మార్ట్ రీడింగ్ పెన్, స్మార్ట్ ఇంటరాక్టివ్ లెర్నింగ్ విధానాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో మెలు గ్రూప్ మేనేజర్ సుప్రియ శ్రీధర్, అకడమిక్ అడ్వైజర్ సుప్రియ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూముల రీ సర్వే ప్రక్రియ

కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : భూముల రీ సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకతతో,పకడ్బందీగా నిర్వహించి,నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.మంగళవారం ముధోల్ మండలం చందాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మొత్తం పట్టా భూముల విస్తీర్ణం, సాగునీటి వసతులు ఉన్న భూములు,ఇతర భూముల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూముల సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా భూ హద్దులను కచ్చితంగా గుర్తించాలని సూచించారు. భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా,ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ రీ సర్వే చేపట్టాలని తెలిపారు.సర్వే ప్రక్రియను వేగవంతం చేసి,నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ పరిశీలనలో తహసీల్దార్ శ్రీలత,సర్వే అధికారులు,సంబంధిత శాఖల అధికారులు,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్ రేణుక ఎల్లమ్మ ఆలయానికి భక్తుల తాకిడి

కనీస వసతుల కల్పనలో నిర్లక్ష్యం





ప్రజాపక్షం/దిలావర్‌పూర్ : నిర్మల్ జిల్లా దిలావర్ పూర్ మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయా నికి వందల ఏళ్ల చరిత్ర ఉందని స్థానికులు చెబుతారు. స్వయంభూగా వెలసిన అమ్మవారిని దర్శించుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ప్రతి ఆదివారం, మంగళవారం పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. దసరా శరన్నవరాత్రుల సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. అయితే, ఇంతటి ప్రాశస్త్యం కలిగిన ఆల యానికి భక్తుల రాక పెరుగుతున్నా,వారికి అవసరమైన కనీస సౌకర్యాలు మాత్రం అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.ఆలయాన్ని నూతనంగా పునర్ని ర్మించినప్పటికీ భక్తుల అవసరాలకు అనుగుణంగా వస తులు కల్పించడంపై దృష్టి సారించాల్సిన అవసరం కని పిస్తోంది. ఆలయానికి వచ్చే మహిళా భక్తులకు కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతు న్నాయి.ముఖ్యంగా బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు లేకపోవడం, మూత్రశాలలు, మరుగుదొడ్లు అందుబాటులో లేకపోవడం సమస్యగా మారింది. కుటుంబాలతో, చిన్నపిల్లలతో వచ్చే మహిళలు గంటల తరబడి ఆలయ పరిసరాల్లో గడపాల్సి వస్తున్నా, వారి అవసరాలను తీర్చే వసతులు లేక ఇబ్బందులు పడుతు న్నారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ఆదివారం, మంగ ళవారం రోజుల్లో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది.ఆలయానికి వచ్చే మహిళలకు గౌరవప్రద మైన, సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఆలయానికి ఉన్న ప్రత్యేకతల్లో కోనేరు ఒకటి.కోనేటిలో స్నానం ఆచరిస్తే చర్మవ్యాధులు నయ మవుతాయని భక్తులు విశ్వసిస్తారు. ఈ నమ్మకంతో దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఇక్కడికి వస్తుం టారు. అయితే, కోనేటి వద్ద స్నానాలు ఆచరించే భక్తు లకు అవసరమైన సౌకర్యాలు,దుస్తులు మార్చుకునే గదులు, పరిశుభ్రతకు సంబంధించిన ఏర్పాట్లు ఎంతవ రకు అందుబాటులో ఉన్నాయనే ప్రశ్నలు తలెత్తుతు న్నాయి. కోనేటి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని కాపాడటంతో పాటు నీటి పరిశుభ్రత, పరిసరాల నిర్వ హణపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపా ల్సిన అవసరం ఉంది. భక్తుల విశ్వాసాలకు అనుగు ణంగా కోనేటి ప్రాంతాన్ని పరిశుభ్రంగా, సౌకర్యవం తంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు. ఆల యానికి వచ్చే భక్తుల్లో చాలామంది కుటుంబాలతో కలిసి వచ్చి వంటలు చేసుకుని భోజనం చేసిన అనం తరం తిరుగు ప్రయాణమవుతుంటారు. అయితే, ఆలయ పరిసరాల్లో వంటలు చేసుకునేందుకు సరిపడా స్థలం లేకపోవడంతో కొందరు భక్తులు చుట్టుపక్కల తోటల్లోకి వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. ఈ క్రమంలో తోటల యజమానులతో ఇబ్బందులు ఎదుర వుతున్నాయని పొరుగూరి భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. వంట చేసుకునేందుకు ఆలయంలో ఏర్పాటు చేసిన వంటశాలలు ఉన్నప్పటికీ, ప్రస్తుతం వస్తున్న భక్తుల సంఖ్యకు అవి సరిపోవడం లేదని పేర్కొంటు న్నారు. దీంతో భక్తులు ఎక్కడ వంట చేసుకోవాలి? ఎక్కడ కూర్చుని భోజనం చేయాలి? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.వందల ఏళ్ల చరిత్ర, విశేషమైన భక్తి విశ్వాసాలు కలిగిన రేణుక ఎల్లమ్మ ఆలయానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తున్న నేపథ్యంలో వారికి బస్ సౌకర్యాలు, బస్ షెల్టర్ లాంటి సౌకర్యా లపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. చాలావరకు భక్తులు రోడ్డు పక్కన వాహనాల కోసం ఎదురుచూస్తుంటారు. ఆ లయ అభివృద్ధి అంటే కేవలం నిర్మాణాలు చేపట్టడమే కాకుండా, భక్తులకు పరిశుభ్రమైన వాతావరణం, మ హిళలకు గౌరవప్రద మైన వసతులు, కుటుంబాలతో వచ్చే వారికి వంట, భోజన సౌకర్యాలు కల్పించడం కూడా. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, గ్రామ పంచాయతీ పాల కులు, ఆలయ నిర్వాహకులు సమగ్రంగా పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతు న్నారు. భక్తి విశ్వాసాలకు నిలయమైన ఈ ఆలయం కనీస సౌకర్యాల లేమితో ఇబ్బందులకు కేంద్రంగా మారకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత యంత్రాంగంపై ఉంది.

యువ ఆపదమిత్ర శిక్షణలో శాతవాహన వలంటీర్లు

ప్రజాపక్షం / కరీంనగర్ రూరల్ ప్రతినిధి: కరీంనగర్ శాతవాహన విశ్వవి ద్యాలయంలోని కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్‌కు చెందిన 9 మంది విద్యార్థి వలంటీర్లు యువ ఆపద మిత్ర శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన దళం ఆధ్వర్యంలో మంచి ర్యాల జిల్లా గుడిపేట బెటాలియన్ శిబిరంలో అక్టోబర్ 27 నుంచి నవంబర్ 2 వరకు రెండవ విడతలో భాగంగా నిర్వహించిన ఏడు రోజుల శిక్షణలో విద్యార్థులు పాల్గొన్నారు. ఈ శిక్షణలో విపత్తుల సమయంలో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు అవసర మైన ప్రథమ చికిత్స, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించడం, ఈత, తాళ్ల సహాయంతో రక్షణ చర్యలు, బాధితులను సురక్షిత ప్రాంతా లకు తరలించడం వంటి అంశాలపై సైద్ధాంతిక, ప్రయోగిక శిక్షణ తీసుకున్నట్లు విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య .ఉమేశ్ కుమార్ తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులను ఉప కుల పతితోపాటు రిజిస్ట్రార్, కళాశాల ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు అభినందించారు.

పట్టణాలలో ఉపాధి పని కన్పించాలి

సుంకరి సంపత్



ప్రజాపక్షం/కరీంనగర్: పట్ట ణాల్లో ఉపాధి పని కల్పించా లని, మెట్లకు కనీస వేతనం ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు వేతనం పెంచాలని ఉపాధి హామీ కూలీలకు రోజు కూలి 800 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 6న హైదరాబాదు లోని కమిషనర్ ఆఫీస్ ముందు జరిగే ధర్నాలో జిల్లా నుండి వేలా దిగా ఉపాధి కార్మికులు , సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి సంపత్ పిలుపునిచ్చారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం అనేక కొత్త మున్సిపాలి టీలు, మున్సిపల్ కార్పొరేషన్ లు, మండల కేంద్రాలు, నగర పంచా యతీలు ఏర్పడ్డాయని, విస్తరణ పేరుతో అనేక గ్రామాలను వీటిలో విలీనం చేశారని అన్నారు. పట్టణాలలో కలిశారు అనే పేరుతో ఈ గ్రామాలలో అమలు అవుతున్న గ్రామీణ ఉపాధి హామీ పనిని ప్రభుత్వం రద్దు చేశారని, నిరుపేదలు పని లేక గ్రామాలు వదిలి వల సలు పని కోసం వెళుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలం గాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాయకంటి శ్రీని వాస్, జిల్లా కమిటీ సభ్యులు బుర్ర రత్నాకర్ పాల్గొన్నారు...

అమరవీరుల స్ఫూర్తితో పోరాడాలి

ప్రజాపక్షం/ఖానాపూర్ : భూమి కోసం,భుక్తి కోసం, ఈ దేశ విముక్తి కోసం తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించిన అమరులను స్మరిస్తూ మంగళవారం రోజున సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా ఆధ్వర్యంలో ఖానాపూర్ ఐబీలో అమరవీ రుల సభ ర్యాలీ నిర్వహించారు.ఈ సంద ర్భంగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రా మయ్య మాట్లాడుతూ, దోపిడీ, పీడన లేని సమ సమాజ స్థాపన కోసం అమరులు తమ అమూల్యమైన ప్రాణాలను ప్రజల కోసం అర్పించారని అన్నారు. వారి త్యాగాల బా టలో ముందుకు సాగుతూ ప్రజాస్వామిక హక్కుల కోసం, సోషలిస్టు సమాజం కోసం నేటి యువత పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మండల పార్టీ నాయకులు రాజన్న, శంకర్, చందు, మచ్చ శ్రీనివాస్‌తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి ప్రణాళిక

ప్రజా పక్షం /దిలావర్‌పూర్ : గ్రామీణ పేద మహిళలకు స్థిరమైన జీవనోపాధులు క ల్పించి, వారి ఆదాయాన్ని పెంపొందించ డం ద్వారా లక్షాధికారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చైతన్య మండల సమాఖ్య భవనం లో దిలావర్‌పూర్,నర్సాపూర్ మండలాల సీసీలు, వీవోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వ హించారు.ఈ సందర్భంగా అధికారి విజయ లక్ష్మి మాట్లాడుతూ, శిక్షణను సద్వినియో గం చేసుకొని పేద మహిళలను ప్రణాళికాబ ద్ధంగా లక్షాధికారులుగా తీర్చిదిద్దాలని సూ చించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ ప ర్సన్, డిపిఎం శోభారాణి, ఏపీఎం బోసు, సీసీ శ్రీనివాస్, వీవోఏలు, రెండు మండలాల సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

గన్నేరువరం–ఎలగందుల బ్రిడ్జి నిర్మాణం జాప్యంపై నిరసన

బ్రిడ్జి సాధన సమితి ఆధ్వర్యంలో ర్యాలీ



ప్రజాపక్షం / గన్నేరువరం : గన్నేరువరం నుంచి ఎలగం దుల వరకు ప్రతిపాదించిన బ్రిడ్జి నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోందని మండిపడుతూ బ్రిడ్జి సాధన సమితి ఆధ్వ ర్యంలో మంగళవారం బస్టాండ్ నుంచి బ్రిడ్జి శంఖుస్థాపన గద్దెల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సా ధన సమితి నాయకులు మీసం లక్ష్మణ్, కాంతాల అంజి రెడ్డి మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.77 కోట్లు మంజూరు చేసి ఏడాది గడుస్తున్నా ఇప్పటివ రకు శంకుస్థాపనకు నోచుకోకపోవడం పట్ల సాధన సమితి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తుందన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రానికి వెళ్లడానికి సరైన రవాణా మార్గం లేక ప్రతి నిత్యం ప్రజలు, రైతులు, విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యో గులు తీవ్ర నరకయాతన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణంలో జరుగుతున్న జాప్యంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తక్షణమే స్పందించి సమా ధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గన్నేరువరం నుంచి మైలారం మీదుగా బేగంపేట వరకు డబుల్ రోడ్డు పనులు మొదలుపెట్టి ఏండ్లు గడుస్తున్నా కంకర పోసి వదిలేశారని దాంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించక పోతో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజలు పాల్గొన్నారు.

అంతర్జాతీయస్థాయిలో ప్రతిభ చాటిన పారమిత విద్యార్థులు



ప్రజాపక్షం / కొత్తపల్లి : జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను చాటుతున్న పారమిత హెరిటేజ్ పాఠ శాల విద్యార్థులు మరో అరుదైన ఘనతను సాధించారు. మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లోని ఐటీఎం యూనివర్సిటీ అక్టోబర్ 23 నుంచి 28 వరకు నిర్వహించిన 21వ అంత ర్జాతీయ సాంస్కృతిక ఉత్సవం ఉద్భవ్ ఉత్సవ్2026లో పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన మ్యూజిక్ బ్యాండ్ బృందం అద్భుత ప్రతిభ కనబరిచి గ్రూప్ మ్యూజికర్ బ్యాండ్ విభాగంలో ప్రథమ బహుమతిని కైవసం చేసుకుం దని పాఠశాల డైరెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఉద్భవ్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వ హించిన ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సాంస్కృతిక ఉత్సవం అంతర్జాతీయ సాంస్కృతిక ఒలంపియాడ్‌గా ప్రసిద్ధి చెందింది. ఈ అంతర్జాతీయ సాంస్కృతిక పోటీని మధ్యప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సంచాలకుల ఆధ్వ ర్యంలో భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, మధ్యప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక శాఖ సహకారంతో నిర్వ హించారు. ఈ ప్రతిష్టాత్మక పోటీలో మంగోలియా, కిర్గిజి స్తాన్, స్లోవేకియా తదితర వివిధ దేశాలకు చెందిన కళాకా రులు, సంగీత బృందాలు పాల్గొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు చూపిన ప్రతిభను పాఠశాల చైర్మన్ డా.ఇ.ప్రసాద రావు ప్రశంసిస్తూ భవిష్యత్‌లో ఇలాంటి విజ యాలు మరిన్ని సాధించాలని ఆకాంక్షిస్తూ సంగీత ఉపా ధ్యాయులు జితుమణి శర్మ, కిరణ్, సాహు, సూరజ్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, వినోద్ రావు, వియుఎం ప్రసాద్, హనుమంతరావు, పాఠశాల ప్రధానో పాధ్యాయులు గోపికృష్ణ, శర్మిష్ట ఉపాధ్యాయులు, విద్యా ర్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భవన కార్మిక సంఘాలతో సంయుక్త సమావేశం ఏర్పాటుకు జెఏసి డిమాండ్



ప్రజాపక్షం/కరీంనగర్: జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘాల రౌం డ్ టేండ్ సమావేశం కోతిరాంపూర్‌లోని ముకుంద లాల్ మిశ్రా భవన్ లో మంగళవారం సత్తన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావే శంలో 11 కార్మిక సంఘాలు హాజరుకాగ జిల్లా కలెక్టర్ ఆధ్వ ర్యంలో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని తీర్మానం చేశా రు. తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్ మాట్లాడుతూ తమ సమస్యలపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోగా లేబర్ కమిష నర్ కు జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా.. ఇప్పటివరకు సమావేశం ఏర్పాటుచేయలేదన్నారు. సమ స్యలు పరిష్కారం ఎక్కడికక్కడ పేరుకుపోయాయని, వెల్ఫేర్ బోర్డు నిధుల క్లెయిమ్స్ ఫిబ్రవరి నుండి పెండింగ్ ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌టియు అనుబంధ సంఘం నాయకులు మల్లేశం, రాములు, సిఐటియు అనుబంధ సంఘం అధ్యక్షులు రమేష్, ఉపాధ్యక్షులు చక్రపాణి, బిల్డర్స్ అసోసియేషన్ నాయకులు కొమురయ్య, పర్శరాములు,పెయింటర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్, ప్లంబర్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేశం, టైల్స్ అసోసి యేషన్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, బిఆర్‌టియూ యూనియన్ నాయ కులు లక్ష్మణ్, ఎల్లయ్య, బాబు పాల్గొన్నారు.